

రియల్టర్‌పై 30 మంది బాధితుల ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, జనవరి 20 : భూ ఆక్రమణపై ఫిర్యాదులు వెల్లువత్తున్నాయి. శనివారానికి ఫిర్యా దుల సంఖ్య 75కు చేరింది. బాధితులు సీపీ కార్యాలయానికి క్యూ కడుతుండటంతో పోలీస్ కమిషనర్ ఉదయం నుంచి రాత్రి వరకు ఫిర్యాదు దారులతో మాట్లాడుతూ సమాచారాన్ని, ఆధారా లను సేకరిస్తున్నారు. ఒక్కో కేసును ఒక్కో అధికారికి అప్పగించి విచారణ చేసి నివేదిక అందించాలని ఆదేశిస్తున్నారు. కరీంనగర్ శివారు ప్రాంతంలో ఒక రియల్టర్ కొంత కాలం కిందట 60 ఇంటి స్థలాలతో వెంచర్‌ను చేసి విక్రయించాడు. ఆ వెంచర్‌లో ఇదివరకు 30 అడు గుల రోడ్లను చూపించి ప్లాట్లను విక్రయించగా తాజాగా 15 అడుగుల రోడ్లుగా మార్చి మరి కొన్ని ప్లాట్లను విక్రయిస్తూ మోసం చేశాడని ఆ వెంచర్‌లో ప్లాట్లు కొని మోసపోయిన 30 మంది బాధితులు శనివారం సీపీని కలిసి ఫిర్యాదు చేశారు. బొమ్మకల్ సర్పంచ్‌కు సంబం ధించి అందిన ఫిర్యాదులపై ఒక ఏసీపీ ఎనిమిది మంది బాధితుల నుంచి వాంగ్మూలాలను రికార్డు చేసుకుని, ఆధారాలను సేకరించారు. దీనికి సంబంధించి త్వరలోనే పూర్తి స్థాయి నివేదికను సీపీకి అందజే యనున్నట్లు సమాచారం. భూ కబ్జా బాధితులు కొందరు సోమవారం హైదరాబాద్‌లో జరిగే ప్రజా దర్బారుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. శని వారం ఒక్క రోజే 30కి పైగా ఫిర్యాదులు అందాయి. ఇందులో ముగ్గురు కార్పొరేటర్లపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిసింది. రేకుర్తికి సబంధించి మరొక రియల్టర్ భూముల రిజిస్ట్రేషన్‌పై మోసం చేసినట్లు ఫిర్యాదు అందింది.

భూ ఆక్రమణలు, అవినీతిపై ఉక్కుపాదం..

- ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ



భూఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, అవినీతిపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతుందని మాన కొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయం కోసం ప్రజలు నిర్భయంగా ప్రభుత్వాన్ని ఆశ్రయించవచ్చన్నారు. జిల్లాలో గత ప్రభుత్వ పాలకులు, నాయకులు ప్రజల భూము లను దౌర్జన్యంగా ఆక్రమించారని విమర్శించారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, ప్రభుత్వ స్థలాల్లో అనుమతులు తీసుకోకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో, పత్రికాముఖంగా, అధికారులు, ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలన్నారు. అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదం మోపి బాధ్యులపై చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన సంఘటనలు ఇందుకు తాజా నిదర్శనంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన వారు ఏ పార్టీకి చెందిన వారైనా, ఏ స్థాయిలో ఉన్నా ఉపేక్షించకుండా నిస్సంకోచంగా వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రజలకు అండగా ఉండడంతోపాటు ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని, కఠినంగా వ్యవహరించాలని ఇప్పటికే నిర్ణయం తీసుకోవడంతోపాటు ఆ దిశగా కార్యాచరణ ప్రారంభించామన్నారు. ప్రజలు రాష్ట్ర ప్రభుత్వంపై సంపూర్ణ విశ్వాసంతో తమకు జరిగిన అన్యాయం అక్రమాలపై నిరభ్యంతరంగా ఫిర్యాదు చేయాలని కోరారు.



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలి

- సీపీ అభిషేక్ మొహంతి

హుజూరాబాద్, జనవరి 20: హుజూరాబాద్ డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని సీపీ అభిషేక్ మొహంతి పోలీస్ అధికారులకు సూచిం చారు. శనివారం హుజూరాబాద్ ఏసీపీ కార్యాల యంలో సబ్ డివిజన్ స్థాయి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరా లను, వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసుల కారణాలు తెలుసుకుని త్వరగా వాటిని దర్యాప్తు చేసి ముగించాలన్నారు. పోలీస్ స్టేషన్లో ఎస్‌హెచ్‌వోలు పిటిషన్ మేనేజ్‌మెంట్ సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాల న్నారు. ఎటువంటి కేసులైనా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచవద్దన్నారు. భౌతిక నేరాలు, ప్రజలను మోసాలకు గురి చేసి కేసులు నమోదు కాబడిన వారిపై పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్‌ల అమలు చేయుట, మొదలకు అంశా లకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమా వేశంలో ఏసీపీలు జీవన్‌రెడ్డి, విజయ్‌కుమార్, సీఐలు రమేష్, కిశోర్, రమేష్, సంతోష్‌కుమార్, ఎస్‌ఐలు వంశీకృష్ణ, రాజకుమార్, ఆరోగ్యం, లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం మాకు లేదు

- ప్రజా తీర్పును శిరసావహించి ప్రతిపక్షంలో ఉంటాం
- బీఆర్‌ఎస్‌ను చీల్చడం ఎవరి తరం కాదు
- భూకబ్జాలే కాదు.. తప్పుచేస్తే ఎవరికైనా శిక్ష తప్పదు
- వెంకన్న బ్రహ్మోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తే స్వాగతిస్తాం
- ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, జనవరి 20: 'ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం బీఆర్‌ఎస్ పార్టీకి లేదు.. ప్రజలు మాకు పదేళ్లు అధికారంలో ఉండేందుకు అవకాశమిచ్చారు.. ఇప్పుడు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారు.. ప్రజల తీర్పును శిరసావహించి ప్రతిపక్షంలో ఉంటాం'.. అని ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని, ఇక్కడ బీఆర్‌ఎస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని, కాంగ్రెస్ మూడోస్థానానికే పరిమితమ వుతుందని గంగుల కమలాకర్ అన్నారు. శనివారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎలక్ట్రానిక్ మీడియాతో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా తెలియదని అన్నారు. కరీంనగర్ ఎంపీగా పొన్నం ప్రభాకర్ గెలిచిన తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు తగ్గాయన్నారు.కరీంనగర్‌లో కాంగ్రెస్ సొంతంగా గెలి చింది లేదని, ఎమ్మెస్సార్ కూడా టీఆర్‌ఎస్ మద్దతుతోనే గెలి చారని చెప్పారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి పోరాడుతూ ప్రతిపక్ష పాత్రను సమర్థ వంతంగా పోషిస్తామని తెలిపారు. 1999లో చంద్రబాబు నెలరోజుల్లోనే ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిం చడంతో ఆ ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై పడిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరునుబట్టి ఎన్నికల్లో ప్రభావం ఉంటుందని చెప్పారు. బీఆర్‌ఎస్‌ను ఎవరూ చీల్చలేరని, తామంతా కలిసే కుటుంబంలాగా ఉంటామన్నారు. భూకబ్జాలు ఎవరు తప్పుచేసినా శిక్ష అనుభ వించాల్సిందేనని, అయితే కక్ష పూరితంగా వ్యవహ రించకుండా చట్టబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్పొరేషన్‌లో మేయర్‌పై అవిశ్వాసం ఉండబోదని, కార్పొరేటర్లంతా తమవైపే ఉన్నారని చెప్పారు. 45 రోజుల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని అన్నారు. 21న కార్యకర్తలతో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశం, 24న పార్లమెంట్ స్థాయి సోషల్ మీడియా సమావేశాలు ఏర్పాటు చేశామని, ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని చెప్పారు. వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను ప్రభుత్వ పరంగా తామే నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే కమలాకర్ అన్నారు. బ్రహ్మోత్సవాలను భక్తిపరంగా చేయాలని కోరుకుంటున్నామని అన్నారు. తాము ప్రారంభించిన రేకుర్తి లక్ష్మీనర్సింహస్వామి ఆల యం, టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేసి భక్తిని చాటు కోవాలని సూచించారు. ప్రజల కోసం తాము ప్రారంభించిన మానేరు రివర్‌ఫ్రంట్‌తోపాటు ఇతర అభివృద్ధి పనులన్నింటిని పూర్తి చేయాలని కోరుకుంటున్నట్లు గంగుల కమలాకర్ తెలి పారు. అయోధ్య రామమందిర నిర్మాణాన్ని తాము రాజకీయ కోణంలో చూడబోమని, రాముడు అందరి వాడని, దైవ కార్యక్రమం ఎవరు చేసినా స్వాగతించి సంతోషిస్తామని చెప్పారు.



మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

ముస్తాబైన మహాశక్తి ఆలయం

కరీంనగర్ కల్చరల్, జనవరి 20: అయోధ్యలో రామ మందిర నిర్మాణం, బాల రాముడి ప్రతిష్ఠ సందర్భంగా కరీంనగర్ చైతన్యపురి మహాశక్తి దేవాలయంలో సోమ వారం ప్రత్యేకపూజలు నిర్వహించను న్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించగా పూలతో ముస్తాబు చేస్తున్నారు. సోమ వారం ఉదయం 9 గంటల నుంచి రామనామ సం కీర్తన, శ్రీరామ రక్షాస్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణం, 10 గంటల నుంచి శ్రీరాముడికి అభిషేకం,శ్రీరామ, మన్యుసూక్త హోమం నిర్వహిస్తారు.

● అయోధ్య రామాలయ సైకత శిల్ప ప్రదర్శన...

కరీంనగర్‌కు చెందిన సైకత శిల్పి ఆకుల వెంకటేశ్ 10 ఫీట్ల ఎత్తు, 15 ఫీట్ల వెడల్పుతో అయోధ్య రామాలయ సైకత శిల్పాన్ని ప్రదర్శించనున్నారు. ఇప్పటికే పనులు ప్రారంభం కాగా సోమవారం భక్తులు తిలకిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళ వారం శిల్పంలోవాడిన ఇసుకను భక్తులకు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



విద్యుత్ దీపాల వెలుగులో చైతన్యపురి మహాశక్తి ఆలయం

నష్టపరిహారం అందించాలి

శంకరపట్నం, జనవరి 20: జాతీయ రహదారి నిర్మాణం పనుల్లో భూమి కోల్పోయి రెండు సంవత్సరాలైనా నష్ట పరిహారం అందకపోవడంతో బాధిత కుంటుంబాలు శనివారం రోడ్డుపై బైఠాయించి నిరసన దీక్ష నిర్వహిం చారు. శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులో జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో 715 సర్వే నంబర్‌లో భూమి కోల్పోయిన బాధిత కుటుంబాలకు రెండేళ్లు అవుతున్న నష్టపరిహారం అందలేదు. తమకు నష్ట పరిహారం అందించిన తర్వాతనే పనులు ప్రారంభించాలని కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించినా పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరారు.



శంకరపట్నం మండలం మొలంగూర్‌లో రోడ్డుపై బైఠాయించి దీక్ష చేస్తున్న బాధితులు

గర్భిణుల నమోదు వందశాతం చేయాలి

సుభాష్‌నగర్, జనవరి 20: జిల్లాలో గర్భిణుల నమోదు వంద శాతం చేసేలా చర్యలు తీసుకో వాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో గర్భి ణుల నమోదు, ఆరోగ్యమహిళ కార్యక్రమాల ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన మొదటి మూడు నెలల్లో నమోదు చేయాలని, ప్రతి గర్భిణికి ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవం జరిగేలా ప్రోత్స హించాలని సూచించారు. రక్తహీనత లేకుండా ఉండడానికి స్థానికంగా దొరికే ఆహార పదార్థాలను స్వీకరించేలా అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళవారం క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలన్నారు. అదనపు పరీక్షలకు జిల్లా ప్రధాన ఆసుపత్రికి పంపించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి, డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ జువైరియా, డీటీసీవో డాక్టర్ రవిందర్‌రెడ్డి, డీఐవో డాక్టర్ సాజిదా పాల్గొన్నారు.



ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

● 18 ఏళ్లు నిండిన వారందూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

కరీంనగర్ టౌన్: జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం నగరంలోని వావిలాలపల్లి ఆల్ఫోర్స్, శ్రీచైతన్య కళాశాలల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో శని, ఆదివారం అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ క్యాంపు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సంధ్యారాణి, కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ రమేశ్ పాల్గొన్నారు.

● జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

కరీంనగర్ టౌన్: ఓటు ప్రాముఖ్యం తెలిసే విధంగా ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో అన్నారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని 'నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్' అనే నినాదాలతో ఓటరు ప్రతిజ్ఞను ప్రతి ఒక్కరూ చేయాలని పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లా, బూత్‌స్థాయిలో 14వ జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పోలింగ్ బూత్‌లలో నిర్వహించే కార్యక్రమాల్లో కొత్త ఓటర్లకు ఎపిక్ కార్డులను అందజేస్తారని తెలిపారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలి

- 'పంచాయతీ' భవనాలను త్వరితగతిన పూర్తిచేయాలి
- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకొని నిర్ణీత సమయంలో అప్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్లు, జూనియర్ ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు హార్టికల్చర్ ప్లాంటేషన్ పూర్తి చేయాలని అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం క్రింద ప్రతిరోజు గ్రామపంచాయతీలో 50 మంది కూలీలు కచ్చితంగా హాజరుకావాలన్నారు. వ్యవసాయ వ్యవసాయ అనుబంధ, సహజ వనరులు, వ్యక్తిగత పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ కింద నిర్దేశించిన లక్ష్యం మేరకు వంద శాతం బ్యాగ్ ఫిల్లింగ్, విత్తనాలు వేసే పనిని పూర్తిచేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, మండల పరిషత్ డెవలప్‌మెంట్ ప్లాన్ నిర్ణీత సమయంలో తయారు చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. ఫిబ్రవరి 2024లోపు ఇంటి పన్నులు, కరెంటు బిల్లుల వసూళ్లు పూర్తి చేయాలని సూచించారు. గ్రామపంచాయతీ భవనాలను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీవో ఎల్ శ్రీలత, జడ్పీ సీఈవో పవన్‌కుమార్, జీఎం ఇండస్ట్రీస్ నవీన్‌కుమార్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ నరేందర్, డీఎంహెచ్‌వో లలితాదేవి పాల్గొన్నారు.

కరీంనగర్ మహిళా ఠాణా సీఐగా శ్రీలత

కరీంనగర్ క్రైం, జనవరి 20 : కరీంనగర్ మహిళా ఠాణా సీఐగా పి శ్రీలత నియమితు లయ్యారు. ఇప్పటి వరకు మహిళా ఠాణా సీఐగా పనిచేసిన బి శ్రీనివాస్‌ను ఐజీ కార్యాల యానికి, ఐజీ కార్యాలయంలో ఉన్న శ్రీలతను మహిళా ఠాణాకు బదిలీ చేస్తూ శని వారం ఐజీ కార్యాలయం నుంచి ఉత్త ర్వులు జారీ అయ్యాయి. కరీం నగర్ సీసీఆర్‌బీలో పనిచేస్తున్న సీఐ పి దామోదర్‌రెడ్డిని జగిత్యాల జిల్లా మల్యాల సీఐగా బదిలీ చేశారు. మల్టీ జోన్-2లో 10 మంది సీఐలకు బదిలీలు జరిగాయి.

● కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసు కానిస్టేబుల్స్ బది లీలకు రంగం సిద్ధమైంది. ఒకే ఠాణాలో 2, 3 ఏళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్స్ ఇప్పటికే బదిలీలకు దర ఖాస్తు చేసుకోగా వారందరికీ కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీస్ కమిషనర్ బదిలీల జాబితాను సిద్ధం చేసినట్లు స మాచారం. ఒకటి, రెండు రోజుల్లో కమిషనరేట్‌లోని దాదా పు 60 మంది కానిస్టేబుల్స్ బదిలీ అయ్యే అవకాశముంది.

'శాతవాహన'లో భవన ప్రారంభోత్సవం వాయిదా వేయాలి

కరీంనగర్ అర్బన్, జనవరి 20: శాతవాహన విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం మొదటి అంతస్తు వాయిదా వేయాలని కోరుతూ శనివారం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్ మాట్లా డుతూ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ మల్లేష్ పదవీకాలం మే నెలతో ముగుస్తుందన్నారు. ఈ సమయంలో అసంపూర్తిగా, నాసిరకంగా నిర్మించిన పరిపాలనా భవనాన్ని ప్రారంభిం చడానికి ఏర్పాట్లు చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వపు పెద్దల సిఫారసుల మే రకు ఈ భవనాన్ని సీపీడబ్ల్యూతో (సెం ట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్ మెంట్) కాకుండా లోకల్ ఏజెన్సీ (తెలం గాణ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) కాంట్రాక్టర్‌తో నిర్మించారిని, ఆ కాంట్రాక్టర్ పనులు పూర్తిగా నాసి రకంగా చేశారని ఆరోపించారు. దీనిపై అనేక అనుమానాలు ఉన్నం దున సంబంధిత శాఖాధి కారులతో క్వాలిటీ కంట్రోల్ తనిఖీ చేయించిన అనంతరమే భవ నాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు మునిగంటి అనిల్

కాపర్ వైర్ చోరీ

మెట్‌పల్లి రూరల్, జనవరి, 20: సత్తక్కపల్లి గ్రామ శివారులోని వరుద కాలువ వెంట ఉన్న వ్యవసాయం పొలాల్లోని మోటర్ల నుంచి కాపర్ వైర్ చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. శనివారం గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ పొలాలకు నీరు పెట్టడానికి రైతులు వెళ్లగా మోటర్ల నుంచి కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

మొగి పురుగును నివారించాలి

శంకరపట్నం, జనవరి 20: వరి పంటకు మొగి పురుగు ఆశించకుండా రైతులు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి రాచకొండ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తగట్టు గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట పీలక దశలో ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో ముగిపురుగు లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. మొగి పురుగు ఆశించకుండా కార్టప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎనిమిది కిలోలు ఒక ఎకరానికి వేసుకోవాలని చెప్పారు. చిరు పొట్ట దశలో వరిలో లిం గాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకొని పురుగుల ఉధృతిని గమనించాలని సూచించారు.

చిగురుమామిడి: రైతులు అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాదికారి కేతిరి రంజిత్ రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని వరి పంటను ఆయన పరిశీలించారు. కాండం తొలుచుపరుగ నివారణకు రైతులకు సూచనలు చేశారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా రైతులు అధికారలను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళాకు ఎంపిక

చొప్పదండి, జనవరి 20: మండలంలోని రుక్మాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పిరిశెట్టి హర్షవల్లిక రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళాకు ఎంపికయింది. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి వర్చువల్ విజ్ఞానశాస్త్ర మేళాలో స్మార్ట్ రోటీ మేక్ యూజింగ్ సోలార్ ఎనర్జీ అనే ఎగ్జిబిట్‌ను హర్షవల్లిక ప్రదర్శించింది. ఈ ఎగ్జిబిట్ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శనగా ఎంపికయింది. ఈ మేరకు శనివారం పాఠశాల ప్రధానోపాధ్యా యుడు బి రఘుకిశోర్, సైన్స్ ఉపాధ్యాయురాలు గట్టు శ్రీవాణితోపాటు ఉపాధ్యాయ బృందం ఆమెను అభినందించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య


ప్రభాకర్(ఫైల్)

పాలకుర్తి, జనవరి 20: కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పాలకుర్తి మండలం పరిధిలోని ఈసాల తక్కళ్లపల్లిలో శుక్రవారం రాత్రి వొడ్నాల ప్రభాకర్(40) అనే లారీ డ్రైవర్ ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లావణ్య ఈనెల 11న సంక్రాంతి పండుగకు తల్లిగారింటికి దట్నూర్ వెళ్లింది. అప్పటినుంచి ప్రభాకర్ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి 9 గంటలకు తండ్రి వొడ్నాల కిష్టస్వామి, తల్లి కమలతో కలిసి భోజనం చేసి నిద్రపోయారు. శనివారం తెల్లవారుజామున మూత్ర విసర్జన కోసం బయటకు వచ్చి కుమారుడి గదివైపు చూడగా ఉరేసుకొని ఆత్మహత్య కనిపించాడు. ఈ మేరకు బసంత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రభాకర్‌కు ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు బంధువులు పేర్కొన్నారు. మృతుడికి కుమార్తె అక్షిత ఉన్నది.

కడుపు నొప్పి భరించలేక తాపీ మేస్త్రి..

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 20: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగిరెడ్డిపల్లె గ్రామంలో శనివారం రాత్రి జూల సతీష్(35) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాపీ మేస్త్రీగా పనిచేస్తున్న సతీష్ మద్యానికి అలవాటుపడ్డాడు. నాలుగు నెలలుగా తరచూ కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో కడుపునొప్పికి వైద్య పరీక్షలు చేయించుకోగా, మద్యం మానివేయాలని వైద్యులు సతీష్‌కు సూచించారు. చికిత్స తీసుకున్న తర్వాత కూడా మద్యం సేవిస్తూ ఉండేవాడని పోలీసులు తెలిపారు. సతీష్ భార్య సుమలత సంక్రాంతి పండుగకు ఇద్దరు పిల్లలతో సహా పుట్టింటికి వెళ్ళింది. శుక్రవారం రాత్రి తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. శనివారం తెల్లవారు జామున ఇంటి ఆవరణలో షెడ్డుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడు..

తిమ్మాపూర్, జనవరి 20: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో ఓ వృద్ధుడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. అలుగునూర్‌కి చెందిన దండు మల్లయ్య (90) భార్య చాలా రోజుల క్రితం మృతి చెందింది. దీంతో మల్లయ్య తన పెద్ద కూతురి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఇటీవల దండు మల్లయ్య కాలుకు ఇన్ఫెక్షన్ వచ్చింది. దీంతో కరీంనగర్‌లోని ప్రభుత్వ అసుపత్రిలో ఆపరేషన్ చేయించారు. పూర్తి స్థాయిలో నయం కాకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. మృతుడి కూతురి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు ఆటంకం కల్పించిన వ్యక్తిపై కేసు నమోదు

ఓదెల, జనవరి 20 : మండలంలోని ఇందుర్తికి చెందిన కంకణాల పవన్‌రెడ్డిపై శనివారం కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. పొత్కపల్లి విద్యుత్ ఏఈ రాజమల్లు విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆటంకం కల్పించి, దౌర్జన్యం చేశాడని ఏఈ ఫిర్యాదు చేశారని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ దివ్యాంగుడి మృతి

వీర్నపల్లి, జనవరి 20: ఆర్థిక ఇబ్బందులు తాళలేక కుటుంబ పోషణ భారమై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వీర్నపల్లి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన జక్కుల లింబాద్రి(36) అనే దివ్యాంగుడు కూరగాయలు అమ్ముతూ కుటుంబా న్ని పోషిస్తున్నాడు. కుటుంబ పోషణ భారమై ఈనెల 18న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తల్లి ఎల్లవ్వ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. లింబాద్రికి భార్య సరిత, ముగ్గురు కూతుర్లు రుత్విక(7), నిహారిక(5), సాన్విక(3) ఉన్నారు.

గ్రూప్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

గణేశ్‌నగర్, జనవరి 20: బీసీ స్టడీసర్కిల్‌లో గ్రూప్స్-1,2,3,4, ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ దరఖాస్తుల గడువును ఈనెల 24 వరకు పొడిగించినట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్ bcstudycircle.cgg.gov.inలో ఈ నెల 24 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ అర్హత కలిగిన ఉమ్మడి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.5లక్షలకు మించరాదన్నారు. దరఖాస్తుతో పాటు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, లేటెస్ట్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు ఆధార్‌కార్డ్, ఫొటోలను ఆన్లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్, డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని అన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్‌నంబర్ 0878-2268686లో, బీసీ స్టడీ సర్కిల్ నూతన భవనం, కరీంనగర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రేపు ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 20: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14, 17 బాల బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించనున్నారు. కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తామని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పి శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, జిల్లాల క్రీడాకారులు పాల్గొనుటకు అర్హులని తెలిపారు. క్రీడాకారులు ఫొటోతో కూడిన అర్హత ఫారంతో స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్, గత సంవత్సర మార్కుల జాబితాతో హాజరు కావాలని సూచించారు.

మాజీ మంత్రి ఆవిష్కరించిన శిలాఫలకం తొలగింపు


శిలాఫలకం తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మల్యాల, జనవరి 20: గతేడాది క్రితం అప్పటి రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించిన శిలాఫకాన్ని మల్యాల గ్రామ పంచాయితీ సిబ్బంది తొలగించడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.2 కోట్లతో మల్యాల-పెగడపల్లి డబుల్‌రోడ్డు పనులు చేపట్టగా గత ఫిబ్రవరి 25న మల్యాల బ్లాక్ చౌరస్తా వద్ద శిలాఫలకాన్ని అప్పటి మంత్రి ఈశ్వర్ ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. తాజాగా దాన్ని కూల్చివేయడం విమర్శలకు దారి తీసింది.

అసంపూర్తిగా రోడ్డు పనులు


మానకొండూర్-అన్నారం గ్రామాల మధ్య పూర్తి కాని రోడ్డు

మానకొండూర్, జనవరి 20: మానకొండూర్ నుంచి జమ్మికుంట వరకు చేపట్టిన రోడ్డు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం రూ. 70కోట్లతో డబుల్ రోడ్డు పనులు చేపట్టారు. కాగా మండలంలోని మానకొండూర్-అన్నారం గ్రామాల మధ్య అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జమ్మికుంట నుంచి వీణవంక మండలంలోని మామిడాలపల్లి గ్రామం వరకు రోడ్డు నిర్మాణం పూర్తయింది. మండలంలోని పచ్చునూర్ నుంచి మానకొండూర్ వరకు పనులు నిలిచిపోయాయి. దీంతో పాటు ఆయా గ్రామాలలో డ్రేనేజీల నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదు. మానకొండూర్ నుంచి పచ్చునూర్ వరకు 16కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఈ పరిధిలో 8 కల్వర్టులు, రోడ్డు డ్యాంల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా ఇప్పటికీ పట్టించుకోవడం లేదు. తారురోడ్డు లేని ప్రదేశంలో బస్సులు, లారీలు వెళ్తున్న సమయంలో దుమ్ము లేస్తోంది. దీంతో వెనుక వచ్చే ద్విచక్రవాహనదారులు కళ్లల్లో దుమ్ము పడుతుండ డంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శ్రీరాముడి దర్శనానికి
మూడు ప్రత్యేక రైళ్లు

- సికింద్రాబాద్, కాజీపేట, జాల్నా నుంచి అయోధ్యకు..
- ఈనెలాఖరు నుంచి ప్రారంభం
- త్వరలో రిజర్వేషన్ల ప్రక్రియ
- పెద్దపల్లి, రామగుండం, కరీంనగర్ స్టేషన్లలో హాల్టింగ్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)



అయోధ్యలోని రామాలయంలో ఈనెల 22న బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ అనంతరం రామభక్తులు అయోధ్యను సందర్శించేందుకు వీలుగా దక్షిణ మధ్య రైల్వే నెల రోజుల పాటు మూడు ప్రత్యేక రైళ్లను ఉమ్మడి కరీంనగర్ జిల్లా మీదుగా నడపనున్నది. సికింద్రాబాద్, కాజీపే ట, మహారాష్ట్ర జాల్నా నుంచి రైళ్లను నడపనున్నది. సికింద్రా బాద్, కాజేపట నుంచి నడిచే రైళ్లు పెద్దపల్లి జంక్షన్, రామగుండం రైల్వే స్టేషన్లలో ఆగనుండగా, జాల్నా నుంచి వచ్చే రైలు కరీంనగర్ స్టేషన్, పెద్దపల్లి జంక్షన్, రామగుండం స్టేషన్లలో ఆగనున్నాయి. ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు ఒకటి, రెండు రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకునే ప్రక్రియ ప్రారంభం కానున్నది. నెలరోజుల పాటు నడవనున్న ఈ ప్రత్యేక రైళ్ల ద్వారా అయోధ్య రామ మందిరానికి వెళ్లి ఆ జగదబి రాముడ్ని దర్శించుకునే అవకాశాన్ని దక్షిణ మధ్య రైల్వే అధికారులు కల్పించారు. ఈ రైళ్లు నెల రోజుల పాటే నడుస్తాయా, ఆ తర్వాత కొనసాగిస్తారా అనే విషయం తెలియదు. మూడు ప్రత్యేక రైళ్లు దాదాపుగా ఒకే సమయంలో ప్రారం భంకానున్నాయి. ఈ ప్రత్యేక రైళ్లను నడిపించడం వల్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు అయోధ్యకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉండనున్నది.

● సికింద్రాబాద్ నుంచి..

రైలు నంబరు 07221 సికింద్రాబాద్ నుంచి అయోధ్య ధాం జంక్షన్‌కు ఎగువ మార్గంలో ఈనెల 29వ తేదీ నుంచి వచ్చేనెల 29వ తేదీ వరకు నడవనున్నది. జనవరి 29, 31, ఫిబ్రవరి 2, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29 తేదీల్లో సాయంత్రం 4:45 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్‌లో బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు 6:20 నిమిషాలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:38 గంటలకు, రామగుండంకు రాత్రి 8 గంటలకు రానున్నది. మరుసటి రోజంతా ప్రయాణించి ఆ తర్వాత తెల్లవారు జామున 3:30 గంటలకు అయోధ్య జంక్షన్‌కు చేరుకుంటుంది. ఒకటిన్నర రోజు ఈ రైలు నడవనున్నది. ఈ ప్రత్యేక రైలు నంబరు 07222 అయోధ్య ధాం రైల్వే జంక్షన్ నుంచి సికింద్రాబాద్ జంక్షన్‌కు దిగువ మార్గంలో ఫిబ్రవరి 1, 3, 5, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీల్లో, మార్చి 1, 3 తేదీల్లో ఈ రైళ్లు నడవనున్నాయి. అయోధ్య నుంచి మధ్యాహ్నం 2:20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10:30 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్‌కు చేరుకోనున్నది. అయోధ్య నుంచి వచ్చేటప్పుడు రామగుండంకు సాయంత్రం 6:30 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7 గంటలకు, కాజీపేట జంక్షన్‌కు రాత్రి 8:08 గంటలకు చేరుకోనున్నది. ఈ ప్రత్యేక రైలులో 20 స్లీపర్ కోచ్ బోగీలు, 2 సాధారణ బోగీలు ఉండనున్నాయి.

● కాజీపేట నుంచి..

రైలు నంబరు 07223 కాజేపేట జంక్షన్ నుంచి అయోధ్య ధాం రైల్వే జంక్షన్‌కు ఎగువ మార్గంలో ఈనెల 30వ తేదీ నుంచి వచ్చేనెల 28వ తేదీ వరకు ప్రత్యేక రైలు నడవనున్నది. వారంలో మూడు రోజులు మొత్తం 15 ట్రిప్పులు ఈ రైలు నడుస్తుంది. జనవరి 30వ తేదీ ఆరంభమయ్యే ఈ రైలు ఫిబ్రవరి 1, 3, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీలలో కాజీపేట నుంచి సాయంత్రం 6:20 గంటలకు బయలుదేరనున్నది. పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:38 గంటలకు, రామగుండంకు రాత్రి 8 గంటలకు రానున్నది. ఒక రోజు ప్రయాణం తర్వాత మరుసటి రోజు తెల్లవారుజామున 3:35 గంటలకు అయోధ్య ధాం జంక్షన్‌కు చేరుకోనున్నది. ఇదే రైలు నంబరు 07224 దిగువ మార్గంలో ఫిబ్రవరి 2, 4, 6, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, మార్చి 2వ తేదీల్లో ఈ ప్రత్యేక రైలు నడవనున్నది. అయోధ్య నుంచి మధ్యాహ్న 2:20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 9 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకోనున్నది. ఈ రైలు వచ్చేటప్పుడు రామగుండంకు సాయంత్రం 6:30 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7 గంటలకు రానున్నది. ఈ ప్రత్యేక రైలులో 20 స్లీపర్ కోచ్ బోగీలు, 2 సాధారణ బోగీలు ఉండనున్నాయి.

● జాల్నా మీదుగా..

రైలు నంబరు 07649 మహారాష్ట్రలోని జాల్నా నుంచి అయోధ్య ధాం జంక్షన్‌కు వయా పర్బని, పూర్ణా, నాందేడ్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, బల్లార్షా మీదుగా ఎగువ మార్గంలో నడవనున్నది. ఈ రైలు వచ్చేనెల 4వ తేదీన ఉదయం 9:30 గంటలకు జాల్నా రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి బాసర రైల్వేస్టేషన్‌కు మధ్యాహ్నం 3:15 గంటలకు, నిజామాబాద్ జంక్షన్‌కు సాయంత్రం 4 గంటలకు, కోరుట్లకు 5:18 గంటలకు, లింగంపేట్ జగిత్యాలకు 5:50 గంటలకు, కరీంనగర్ రైల్వే స్టేషన్‌కు 6:45 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:35 గంటలకు, రామగుండంకు రాత్రి 8 గంటలకు చేరుకోనున్నది. అక్కడి నుంచి ఒక రోజు ప్రయాణం తర్వాత మరుసటి రోజు తెల్లవారుజామున 3:35 గంటలకు అయోధ్య ధాం జంక్షనుకు చేరుకున్నది.

దిగువ మార్గంలో రైలు సంఖ్య 07650 అయోధ్య ధాం జంక్షన్ నుంచి జాల్నాకు ఫిబ్రవరి 6వ తేదీన మధ్యాహ్నం 2:20 గంటలకు బయలుదేరి ఒక రోజు ప్రయాణం తర్వాత ఉదయం 6 గంటలకు జాల్నా రైల్వే స్టేషన్‌కు చేరుకోనున్నది. ఈ రైలు అయోధ్య ధాం నుంచి వచ్చేటప్పుడు రామగుండంకు రాత్రి 7:25 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:55 గంటలకు, కరీంనగర్ రైల్వేస్టేషన్‌కు 8:35 గంటలకు, లింగంపేట్ జగిత్యాల రైల్వే స్టేషన్‌కు రాత్రి 9:20 గంటలకు, కోరుట్ల రైల్వేస్టేషన్‌కు 9:50 గంటలకు, నిజామాబాద్ జంక్షన్‌కు రాత్రి 11:10 గంటలకు, బాసర రైల్వే స్టేషన్‌కు 11:53 గంటలకు చేరుకోనున్నది. ఉదయం 6 గంటలకు జాల్నా రైల్వేస్టేషన్‌కు చేరుకోనున్నది. ఈ ప్రత్యేక రైలులో 20 స్లీపర్ కోచ్ బోగీలు, 2 సాధారణ బోగీలు ఉండనున్నాయి.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ


నరసింహుడి ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జనవరి 20: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం వరకు క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరి నదిలో స్నానాలు ఆచరించి అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషే కాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కొనసాగుతున్న వేద పారాయణం, హవనం

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, సంపూర్ణ రుగ్వేద హవనం, సంపూర్ణ సామవేద పారాయణం కార్యక్రమాలు మూడవ రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భాగంగా మూడో రోజు వేదపండితులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమం కార్యక్రమంలో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

బుగ్గారం గ్రామ సర్పంచ్ సస్పెన్షన్

బుగ్గారం జనవరి 20: బుగ్గారం గ్రామ సర్పంచ్ సుమలతను సస్పెండ్ చేస్తు జిల్లా పంచాయితీరాజ్ అధికారి దేవరాజు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బుగ్గారం గ్రామానికి చెందిన చుక్క గంగారెడ్డి బుగ్గారం గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని పలు సార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ సూచనల మేరకు విచారణ చేపట్టారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని నిర్ధారణ కావడంతో సర్పంచ్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా పంచాయతీరాజ్ అధికారి దేవరాజు తెలిపారు.

'నవోదయ' ప్రవేశ పరీక్ష ప్రశాంతం

చొప్పదండి, జనవరి 20: నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జాతీయస్థాయిలో సీబీఎస్ఈ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 7,105 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 73 శాతం మేరకు 5,226 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. 1,879 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఎలాంటి సంఘ టనలు లేకుండా పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఆమె తెలిపారు.

కొండగట్టులో బారులు తీరిన భక్తులు


క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

మల్యాల, జనవరి 20: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయంలో అంజన్న ను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. దాదాపు ఇరవై వేలకు పైగా భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, బొజ్జపోతన పరిసరాలు నిండిపోయాయి.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంగాధర, జనవరి 20: గంగాధర మండలం ఇస్లాంపూర్‌లో శుక్రవారం అర్ధరా త్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్(ఏపీ36వై1621)ను పట్టుకున్నట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. గ్రామంలోని వాగు నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎసై తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



గుండిలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రతిమ

రామడుగు, జనవరి 20: విద్యార్థు లు చిన్నతనం నుంచే లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని క్రమశిక్షణతో చదవాలని కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రతిమ అన్నారు. మండలంలోని గుండి గ్రామంలో న్యాయవాది గుమ్మడి ప్రశాంత్, అక్షర హైస్కూల్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ఉన్నత మైన స్థానాలకు చేరుకోవాలంటే తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన మార్గాలను అనుసరించి ముందుకు సాగాలని సూచించారు. సామాజిక మాధ్యమాల కు దూరంగా ఉండాలని చెప్పారు. వాటి వల్ల జీవితంలో విలువైన సమయం వృథా అయిపోతుందని అన్నారు. గృహహింస, వరకట్నం, ఆన్‌లైన్ నేరాలపైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆడపిల్లలు సామాజిక మాధ్య మాల్లో ఫొటోలు, వీడియోలను పెట్టకూడదని, ఏదైనా సమస్యలు వస్తే పోలీసులను వెంటనే సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్ లకు బానిస కాకుండా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన అన్ని పాఠశాలల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేష్, చొప్పదండి సీఐజి రవీందర్, ఎస్ఐ నేరెళ్ళ రమేష్, అక్షర కరస్పాండెంట్ మునిందర్, సర్పంచ్ మానస ప్రవీణ్, న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెలుగుల సంస్థకు బకాయిల చీకట్లు

- సిరిసిల్ల సెస్‌కు రూ.714.57 కోట్లు పెండింగ్
- ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రావాల్సిన బకాయిలు రూ. 624.92 కోట్లు
- పవర్‌లూం విద్యుత్ సబ్సిడీ బకాయి రూ. 82.22 కోట్లు


సెస్ ప్రధాన కార్యాలయం

సిరిసిల్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సహకార రంగంలో దేశంలోనే అగ్రగామిగా పేరొందిన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగానే తయారైంది. గత ప్రభుత్వ హయాం నుంచి బీఆర్ఎస్ అధికార పార్టీకి చెందిన వారే పాలకవర్గంగా ఉన్నారు. దీంతో సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరాల సంఘం (సెస్)కు రావాల్సిన బకాయిలు, సెస్ చెల్లించాల్సిన బకాయిలపై చర్చ లేకుండానే సాగిపోయింది. కొత్త ప్రభుత్వం రావడంతో విద్యుత్ బకాయిల చర్చ ముందుకు వచ్చింది. సెస్ చెల్లించాల్సిన బకాయిలుపై విద్యుత్ సంస్థలు ఒత్తిడి పెంచడంతో సెస్ అధికారులు, పాలకవర్గం బకాయిల వసూలుపై దృష్టి పెట్టింది. ఇదే క్రమంలో సెస్ పరిధిలో ఉన్న సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లను గురువారం తొలగించారు. అధికారుల హుటాహుటిన మళ్లీ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలకు కొత్త ప్రభుత్వంలో మోక్షం లభిస్తుందా? అని వినియోగదారులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

● 420 సర్వీసులతో..

జిల్లాలో చీకట్లను పారదోలి వెలుగులు నింపడానికి 1970లో 420 సర్వీసులతో ప్రారంభమైన సహకార విద్యుత్ సరఫరా సంఘంలో ప్రస్తుతం 2 లక్షల 70 వేల 545 మంది సభ్యులు ఉన్నారు. గృహ కనెక్షన్లు 1,67,984, వాణిజ్య కనెక్షన్లు 16,974 కనెక్షన్లు, పరిశ్రమల కనెక్షన్లు 1394, పవర్‌లూం కనెక్షన్లు 5635, వ్యవసాయ కనెక్షన్లు 74,391, గ్రామ పంచాయతీ వాటర్ కనెక్షన్లు, విద్యుత్ దీపాల 3118, దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వం కార్యాలయాల కనెక్షన్లతో విద్యుత్ రంగంలోనే ప్రత్యేకతను సాధించిన సెస్‌కు ప్రభుత్వం, వినియోగదారులు, వివిధ సంస్థలు చెల్లించాల్సిన బకాయిలు గుదిబండగా మారాయి. ప్రస్తుతం సెస్‌కు రూ.714.57 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఇందులో ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి దాదాపు రూ.624.92 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఇందులో సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు 50 శాతం సబ్సిడీ బకాయిలు రూ.47.07 కోట్లు, దీనికి సర్ ఛార్జ్‌గా రూ.36.14 కోట్లుతో కలిసి రూ.83.22 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా వీటికి సంబంధించి నీటిసరఫరా, వీధి దీపాలకు సంబంధించి 31 జూన్ 2020 నాటికి రూ.319.52 కోట్లు బకాయిలు పేరుకు పోయాయి. వ్యవసాయ విద్యుత్ సబ్సిడీకి సంబంధించి గత సంవత్సరం మార్చి 31 వరకు రూ.174.04 కోట్ల బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వం వీటిని పెండింగ్‌లో ఉంచి పల్లె ప్రగతి, ఆర్థిక సంఘం నిధుల నుంచి విద్యుత్ బకాయిలను చెల్లిస్తూ వస్తోంది. ప్రస్తుతం 2020 ఆగస్టు నుంచి 2023 నవంబరు వరకు రూ.16.76 కోట్లు మళ్లీ పేరకుపోయాయి. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయాలు, 1049 ఉండగా వీటికి సంబంధించి రూ.3.64 కోట్లు బకాయిలు రావాల్సి ఉన్నాయి. జిల్లాలో సెస్ వినియోగదారుల నుంచి వివిధ కనెక్షన్లకు సంబంధించి రూ.77.81 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నా వ్యవసాయ దారుల నుంచి సర్వీస్ రుసుము నుంచి రావాల్సిన బకాయిలు రూ.8.42 కోట్లు రావాల్సి ఉంది. గృహాలకు సంబంధించి రూ.28.76 కోట్లు, కమర్షియల్‌కు సంబంధించి రూ. 9.98 కోట్లు, పరిశ్రమలకు సంబంధించి రూ.8.68 కోట్లు, మరమగ్గాల పరిశ్రమ నుంచి రూ.1.54 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. ఎస్ఎస్ఐ యూనిట్లకు సంబంధించి రూ.18.81 కోట్లు బాకీలు ఉన్నాయి. దీంతోపాటు పల్లె, పట్టణ ప్రగతికి సంబంధించి రూ.21 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి, వినియోగదారుల నుంచి రావాల్సిన బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి కొనసాగుతున్న క్రమంలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనే దానిపై ఆసక్తి నెలకొంది.

21 మంది మందుబాబులకు జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం , జనవరి 20 : మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 21 మందికి జైలు శిక్షతోపాటు జరిమానా, మరో 29 మందికి ఒక్కొక్కరికి. రూ.3వేల చొప్పున జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శనివారం తీర్పు ఇచ్చారు. రెండు నెలల్లో సిరిసిల్ల పట్టణ పరిధిలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా 50 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరికి సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రఘుపతి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు. అనంతరం వారిని శనివారం కోర్టులో ప్రవేశపెట్టగా ఇద్దరికీ మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ 3 వేల జరిమానా, ఏడుగురికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కక్కరికి రూ 3వేల రూపాయల జరిమానా విధించారు. మరో 12 మందికి ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ 3వేల జరిమానా, ఇంకో 29 మందికి ఒక్కొక్కరికి రూ 3వేల చొప్పున జరిమానా విధించినట్లు సిరిసిల్ల టౌన్‌సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడి న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్‌లో వచ్చే ఉద్యోగ, ఉపాధి అవకాశలకు పోలీస్ వెరైఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కులం పేరుతో దూషించిన ఒకరి రిమాండ్

వేములవాడ రూరల్, జనవరి 20: కులం పేరుతో దూషించి దాడి చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ నాగేంద్రచారి శనివారం తెలిపారు. డీఎస్పీ నాగేంద్రచారి తెలిపిన వివరాల ప్రకారం నూకలమర్రి గ్రామానికి చెందిన ముడారపు చంద్రయ్య పొలంలో అదే గ్రామానికి చెందిన లిక్కిడి దేవయ్య అనే వ్యక్తికి సంబంధించిన పశువులు మేత మేసాయి. పశువులు మేత మేస్తే తన పంటకు నష్టం జరుగుతందని దేవయ్యను అడుగగా కులంపేరుతో తనను దూషించి కర్రతో దాడి చేసాడని ముడారుపు చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు విచారణ జరిపి లిక్కిడి దేవయ్యపై అట్రాసిటీ కేసునమోదు చేశామని చెప్పారు. ఈ మేరకు రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు.

శ్రీరాం ఆకృతిలో మానేరు విద్యార్థులు



శ్రీరాం ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన

కరీంనగర్ కల్చరల్, జనవరి 20: అయోధ్య రామమందిరం ప్రారంభాన్ని పురస్కరించుకొని శనివారం మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు సుమారు 600 మంది శ్రీరాం ఆకృతిలో ప్రదర్శన చేపట్టారు. జాతీయ జెండాలతో రామ బాణాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ రాముని జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సునీతారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గణేశ్‌నగర్, జనవరి20: విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యం ఏర్పరచుకొని ముందుకు సాగాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విద్యార్థులకు సూచించారు. మంకమ్మతోటలోని శ్రీ చైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో సాహితీ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం జరిగిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ 35 ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా 1600మంది అభ్యర్థులు పాల్గొనగా 300మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఎస్‌వి శ్రీరంగ ప్రసాద్, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఈ మనోహర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై కిషోర్, విన్నర్స్ పబ్లికేషన్ అండ్ ఆన్లైన్ ఫౌండర్ ప్రసన్న హరికృష్ణ, సాహితీ ఫౌండేషన్ ఫౌండర్ రాముల కుమార్, కళాశాల ప్రిన్సిపాల్స్ ఎల్ శ్రీనివాస్, స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడి, పాల్గొన్నారు.

కొనసాగుతున్న జాతర కమిటీల ఎంపికలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 20:మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో భాగంగా పలు చోట్ల జాతర కమిటీల ఎంపికలు, వేలాలు కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు ఉమ్మడి జిల్లాలో సుమారు 50కి పైగా చోట్లలో జాతరలు సాగనుండగా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో 32 చోట్ల జాతర జరగనుంది. 48 గంటల ముందు నుంచే దేవాదాయశాఖ తరఫున సేవలందించనున్నారు. కమిటీల పరిశీలనతో పాటు జాతర ఏర్పాట్లను, తలెత్తనున్న ఇబ్బందులను ఏసి రోజువారీ పర్యటనలో కార్యాలయంలో సమీక్షలో పరిశీస్తున్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఏసి తెలిపారు.

జైలులో అయోధ్య అక్షింతల వితరణ

కరీంనగర్ క్రైం, జనవరి 20 : అయోధ్య రామ జన్మభూమి ట్రస్టు పూజిత అక్షింతలను వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ జిల్లా జైలు అధికారులు, సిబ్బంది కుటుంబాలకు అందజేశారు. వీహెచ్‌పీ-గోరక్ష ప్రముఖ్ విభాగ్ ఊటుకూరి రాధాకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో జైలు ఆవరణలో ఉన్న క్వార్టర్స్‌కు గడపగడపకు వెళ్ళి అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరిటెండెంట్ జి సమ్మయ్య, జైలర్ శ్రీనివాస్, రమేష్, డిప్యూటీ జైలర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వాణిజ్య పన్నులశాఖలో ఎన్నికల కోలాహలం

- పోటాపోటీగా నామినేషన్ల దాఖలు

కరీంనగర్ టౌన్, జనవరి20: నగరంలోని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కరీంనగర్ డివిజన్ ఎన్నికల సందడి నెలకొన్నది. ఈనెల 24న జరిగే సంఘం ఎన్నికల్లో వివిధ పోస్టులకు పోటీ చేసేందుకు శనివారం ఉద్యోగులు పోటీపడి నామినేషన్లను అందజేశారు. ఆదివారం నామినేషన్ల పరిశీలనతో పాటు ఉపసంహరణ ఉంటుందని ఎన్నికల అధికారి, హైదరాబాద్ ఆబిడ్స్ డివిజన్ వాణిజ్యపన్నులశాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.విక్టర్ పాల్, సహాయ అధికారులు జి.ప్రభాకర్, శ్రీనివాస్ తెలిపారు.ఎన్నికల ప్రక్రియను తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ పరిశీలించగా, టిఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

క్వాలిఫైడ్ టీచర్లకు న్యాయం చేయాలి



ఎమ్మెల్యే కవ్వంపల్లికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శంకరపట్నం, జనవరి 20: 1998లో డీఎస్సీలో ఇంటర్వ్యూలకు హాజరైన క్వాలిఫైడ్ టీచర్లకు న్యాయం చేయాలని శనివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యానారాయణకు కరీంనగర్‌లోని ఆయన నివాసంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆనాటి డీఎస్సీలో టీడీపీ ప్రభుత్వంలో అవినీతి అధికారుల తప్పిదాలకు తాము బలయ్యామన్నారు. 2022లో ఏపీలో ఇదే డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చి న్యాయం చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం చూపి తమకు కూడా ఎంటీఎస్ పద్ధతిలో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిట్టల సంజీవ్, మహ్మద్, కళాధర్, చారి పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

గన్నేరువరం, జనవరి 20: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విష్ణువర్ధన్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడంతో శనివారం విద్యార్థిని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యానారాయణ సన్మానించి అభినందించారు. పాఠశాలలో విద్యార్థులకు క్రీడలపై ఆసక్తిని పెంచేలా కృషి చేస్తున్న పీఈటి రాజబాబును ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ బుర్ర మల్లేష్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్ పాల్గొన్నారు.

ముగిసిన గాలన్న అంత్యక్రియలు

- బొడిగ శోభకు ఈటల, చొప్పదండి ఎమ్మెల్యే పరామర్శ



బొడిగ శోభను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్

సైదాపూర్, జనవరి 20: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ భర్త బొడిగ గాలన్న అనారోగ్యంతో మృతి చెందగా శనివారం తమ సొంత గ్రామమైన సైదాపూర్ మండలంలోని వేంకటేశ్వర్లపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. గాలన్న బౌతికకాయానికి మాజీ మంత్రి ఈటల రాజేందర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సతీమని బండి అపర్ణ, నాయకుడు బోయినపల్లి ప్రవీణ్‌రావు వేంక టేశ్వర్లపల్లికి వెళ్లి గాలయ్య బౌతికకాయం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభను పరామర్శించారు.

మార్చిలోగా 24 గంటల మంచినీటి సరఫరా



పనులను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 20: నగరంలో ఎంపిక చేసిన పైలెట్ ప్రాజెక్టు హౌజింగ్‌బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో మార్చి నెలాఖరులోగా 24 గంటల మంచినీటి సరఫరాను ప్రారంభిస్తామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రకటించారు. శనివారం ఆయన 26వ డివిజన్ కార్పొరేటర్ నక్క పద్మకృష్ణతో కలిసి నగరపాలక సంస్థ నిధులు తొమ్మిది లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పైపులైను పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను వేగంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తయ్యేలా చూడాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నగరంలో తమ పాలకవర్గం చేపట్టిన అభివృద్ధి పనులతో ప్రజలు సంతృప్తి చెంది ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గంగుల కమలాకర్‌ను నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. అంతకుముందు డివిజన్ సమస్యలను కార్పొరేటర్‌తోకలిసి పరిశీ లించి, వాటిని దశలవారిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థలో నిరీక్షణ గదులు

●కరీంనగర్ టౌన్, జనవరి 20: నగరపాలక సంస్థ సేవల నిమిత్తం వచ్చే నగర ప్రజల కోసం నగరపాలక సంస్థకార్యాలయంలో ప్రత్యేక నిరీక్షణ గదులు (వేయిటింగ్ హాల్స్)ను అందుబాటులోకి తెచ్చినట్లు నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. శనివారం ఆయన నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన వేయింటింగ్ హాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వెయింటింగ్ హాల్స్‌లో సౌకర్యవంతమైన సీటింగ్ ఏర్పాటు చేశామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్రీడలతో విద్యార్థుల్లో మానసికోల్లాసం

కరీంనగర్ రూరల్, జనవరి 20: క్రీడలతో విద్యార్థిలో నైపుణ్యం వెలికి వస్తుందని సెయింట్ జార్జ్ (సిబిఎస్‌ఈ) పాఠశాలలల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి అన్నారు. శనివారం రేకుర్తిలోని సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ (సిబిఎస్‌ఈ), విద్యానగర్‌లోని సెయింట్ జార్జ్ నినోస్ బ్లాక్(సిబిఎస్‌ఈ)లో వార్షిక క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడా పోటీలను కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, రిజర్వ్‌ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ (పోలీస్ ట్రైనింగ్ కళాశాల) నలిమేటి రమేష్‌లు టార్చ్ వెలిగించి మారథాన్, చిన్న రన్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భార్గవ్ పాల్గొన్నారు.

బాల రాముని సైకత శిల్పం

కరీంనగర్ కల్చరల్, జనవరి 20: అయోధ్య రామమందిర నిర్మాణం సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ప్రస్తుత పెద్దపల్లి జిల్లా, పాలకుర్తి మండలం, కుక్కలగూడూరు గ్రామానికి చెందిన కరీంనగర్‌లో నివాసముంటున్న సైకతశిల్పి రేవెల్లి శంకర్ అక్కడ ప్రతిష్ఠించనున్న బాల రాముని సైకత శిల్పాన్ని రూపొందించారు. శిల్పానికి ఇసుకను 10 బ్యాగుల ఇసుకను వాడి సుమారు 5 గంటల పాటు శ్రమించినట్లు శంకర్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కరీంనగర్‌రూరల్, జనవరి 20: తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నగునూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పుష్పలత, వైస్ ప్రెసిడెంట్‌గా భార్గవి, జనరల్ సెక్రటరీగా సుమన, జాయింట్ సెక్రటరీగా మౌనిక, ట్రెజరర్‌గా ప్రేమజ్యోతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా సౌజన్య, కావ్య నియమితులయ్యారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సమత పాల్గొన్నారు.

నిబంధనలు సడలించాలి

సుభాష్‌నగర్, జనవరి 20: ముగ్గురు సంతానం కలిగిన వారికి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతించాలని అరుంధతీయ అసహాయ వృద్ధుల-అనాథల సేవా సంఘం అధ్యక్షుడు మాతంగి హన్మయ్య ఎన్నికల కమిషన్‌ను కోరారు. ఈమేరకు శనివారం కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు.

రేకుర్తిలో సమ్మక్క జాతరకు టెండర్లు

కరీంనగర్ కల్చరల్, జనవరి 20: రేకుర్తి సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా శనివారం తలనీలాలు, బెల్లం అమ్ముకునే హక్కు కోసం వేలములు జరిగినట్లు జాతర అధికారి ఎండపల్లి మారుతి, వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త పిట్టల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన టెంకాయల అమ్మకం, కొబ్బరి ముక్కల ప్రోగు, లడ్డూ, పులిహోర అమ్మకాలకు ఈనెల 30న ఉదయం 11గంటలకు వేలాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ యువజన క్రీడా ఉత్సవాలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 20: ఏబీవీపీ కరీంనగర్ నగర శాఖ ఆధ్వర్యంలో జాతీయ యువజన ఉత్సవాలు ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల మైదానంలో శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ విభాగ్ కన్వీనర్ అజయ్, కరీంనగర్ జిల్లా ప్రముఖ్ రాచకొండ గిరిబాబు సర్ జిల్లా కన్వీనర్ పూసల విష్ణు పాల్గొన్నారు. కార్యక్రమంలో మహిళ జిల్లా కన్వీనర్ అనూష, నగర కార్యదర్శి బామాండ్ల నందు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల తడేం మధు, ప్రాంత లా ఫోరమ్ కో కన్వీనర్ నక్క ప్రమోద్ నాయకులు శ్రీవర్ధన్, అన్వేష్, అరుణ్, ఉదయ్, నవీన్ పాల్గొన్నారు.

రేపు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 20: అయోధ్యలో సోమవారం బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా నగరంలోని దాదాపు అన్ని ఆలయాల్లో పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. భజనలు, పారాయ ణాలు, అన్నదానాలు, కల్యాణాలు, పల్లకీసేవలు, సాయంత్రం దీపారాధనలు జరుపనున్నారు.

●యజ్ఞవరాహక్షేత్రంలో సాయంత్రం 6-30 గంటల నుంచి భద్రాద్రిలో రామునికి నిత్యం జరిగే దర్బార్ సేవ, రాజోపచారములు, దీపోత్సవం, రామనామ సంకీర్తన చేయనున్నారు.

●పాతబజార్ గౌరీశంకరాలయంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సీతారాముల కల్యాణం జరుగనుంది.

●ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయక మందిరంలో మధ్యాహ్నం 12-30 గంటల నుంచి శ్రీరామచంద్రుడి పునఃప్రతిష్ఠ, అన్నదానం, సాయంత్రం అష్టోత్తర శత కలశాభిషేకం, దీపమాలికాసేవ, 108 మందిచే కాగడాల ప్రదర్శన జరుగనున్నాయి.

అల్ఫోర్స్‌లో రామనామ జపం.. ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, జనవరి 20: అయోధ్య రామమందిర నిర్మాణం సందర్భంగా శనివారం వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ మైదానంలో రామనామ జపం నిర్వహించారు. శ్రీరామ నామస్మరణలతో నగర వీధుల గుండా ఊరేగింపు జరిపారు. చిన్నారుల లవకుశ నృత్యం ప్రధానాకర్షణగా నిలిచింది. ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి అయోధ్య రామమందిరం హిందువుల చిరకాల స్వప్నమని అన్నారు.

ఎస్‌యూలో నియామకాలపై విచారణ జరిపించాలి

గణేశ్‌నగర్, జనవరి 20: శాతవాహన యూనివర్సిటీలో రిటైర్డ్ ప్రొఫెసర్ల నియామకంపై ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ విచారణ జరిపించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ ప్రభుత్వాన్ని ప్రకటనలలో డిమాండ్ చేశారు. ఎక్కడా నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా తమకు అనుకూలమైన వారిని యూనివర్సిటీలో రిటైర్డ్ అయిన వారికి అవకాశం కల్పించారన్నారు. దీనివల్ల అనేకమంది ఉద్యోగ అవకా శాలు కోల్పోయారని ఓ పక్క రిటైర్డ్ పింఛన్ తీసుకుంటూనే మళ్లీ ఇటు జీతాలు తీసుకుంటూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడతూన్నా రన్నారు. అసలు శాతవాహనలో కొందరు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రిటైర్డ్ ప్రొఫెసర్లు అనేకమంది పాఠాలు చెప్పకుండానే జీతాలు తీసుకుంటున్నారని, కొందరు అధికారులు యూనివర్సిటీ వాహనాలను సొంతానికి వాడుకుంటున్నారని తెలిపారు.

'కార్పొరేటర్‌ను పదవి నుంచి తొలగించాలి'

సుభాష్‌నగర్, జనవరి 20: బీసీ స్థానం నుంచి పోటీ చేసి గెలిచిన ఓసీ మహిళా కార్పొరేటర్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని అడ్వకేట్ సాదవేణి వినయ్‌కుమార్ కోరారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని 6వ డివిజన్ బిసి మహిళకు రిజర్వేషన్ అయినప్పటికి స్థానికంగా ఉన్న కోల మాలతి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మహిళ అని ఆరోపించారు. దొడ్డిదారిన బీసీ సర్టిఫికెట్ సంపాదించి 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేశారని తెలిపారు. నిజానికి వారి ఎన్నిక చెల్లదని కలెక్టర్ తేల్చినప్పటికీ, అప్పటి మంత్రి గంగుల ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈరోజు వరకు ఆమె కార్పొరేటర్ పదవిలో కొనసాగుతున్నారని తెలిపారు. ఈ విషయమై తాము బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్ళామన్నారు. ఆయన వెంటనే స్పందించి దీనిపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దాం

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, జనవరి 20: నియోజకవర్గంలోని అన్ని శాఖల ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేసి హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిద్దామని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. హుజూరాబాద్ మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం వివిధ శాఖలాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని విభాగాల్లో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకునేందుకు చర్యలు తీసుకుంటా మని చెప్పారు. ఎలాంటి అధికార ఒత్తిడిలకు లొంగకుండా అధికారులు, ఉద్యో గులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఒక్కో విభాగంతో ప్రతి నెలా రివ్యూ ఏర్పాటు చేసుకుందామన్నారు. అందులో సమస్యలను చర్చించుకుందా మన్నారు. జనరల్ బాడీ సమావేశంలో కూడా సభ్యులు లేవనెత్తిన అంశాలను కూడా పిన్ చేయాలన్నారు. అధికారులకు తనవంతు సహకారం తప్పక ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో రాజు, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

గన్నేరువరం, జనవరి 20: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సీడీపీవో సబిత అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఎంపీపీ మల్లారెడ్డి అధ్యక్షతన మండల అధికారులతో నిర్వహించిన సమావేశంలో సీడీపీవో మాట్లాడారు. 18 ఏళ్ల లోపు బాల బాలికల హక్కులు, బాల్య వివాహాలు, పరిరక్షణ, డ్రాప్ అవుట్ పిల్లలు, దత్తత, భిక్షాటన, బాల కార్మికులు, అనాధ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, తహసీల్దారు భిక్షపతి, ఎస్సై నరసింహారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇస్రత్ సుల్తానా, మెడికల్ ఆఫీసర్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ అర్హత పరీక్ష

హుజూరాబాద్, జనవరి 20: హుజూరాబాద్‌లో నవోదయ అర్హత పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో నర్సింహారెడ్డి తెలిపారు. 262మంది విద్యార్థులు హాజర య్యారని తెలిపారు.

రేపు సీతారామచంద్రస్వామి కల్యాణం

హుజూరాబాద్, జనవరి 20: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉన్న ఆలయంలో సోమవారం శ్రీసీతారామ చంద్రస్వామి కల్యాణ మహోత్సవం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్యలో రాముడి కుంభాభిషేకం, ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని క ల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు.

గుండెకు రంధ్రంతో ఒకరి మృతి

తిమ్మాపూర్, జనవరి 20: మండలంలోని పోరండ్ల గ్రామంలో కుమార్(17) అనే వ్యక్తి గుండెకు రంధ్రం కారణంగా పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. కుమార్ రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడు. శనివారం తల్లిదండ్రులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి వస్తుండగా మార్గ మధ్యలో కుమార్ మృతి చెందాడు.

అర్హులు ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

మానకొండూర్, జనవరి 20: రెండు రోజుల పాటు పోలింగ్ బూతుల వద్ద నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అన్నారు. మండలంలోని ముంజంపల్లి గ్రామంలోని పోలింగ్ బూత్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ,యువకులు నూతనంగా ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని 316 పోలింగ్ కేంద్రాలలో రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. నియోజకవర్గంలో 653 మంది, మండలంలో 152 మంది నూతన ఓటరుగా నమోదు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, రెవెన్యూ సిబ్బంది, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఆలయాల శుద్ధి

హుజూరాబాద్, జనవరి 20: హుజూరాబాద్ పట్టణంలోని రామాలయం, హనుమాన్ దేవాలయాలను శనివారం బీజేపీ నాయకులు శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్నందున ఆలయాలను శుద్ధి చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు, రాజు, వాసు, కె శ్రీనివాస్, కోటేశ్వర్‌రావు, రాంప్రసాద్, నర్సింహులు, సందీప్, భార్గవ్, రాజశేఖర్, అనిల్, సాయిరాం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల మానేరునగర్‌లో శ్రీ పంచముఖ అంజనేయ స్వామి, శ్రీ రామసాయి ఆలయాన్ని పరిసర ప్రాంతాలను కమిటీ ప్రతినిధులు, స్థానిక మహిళలు శుద్ధి చేశారు. నెల 22న ఆయోధ్య రాముడి దైవ కార్యక్రమాన్ని దేవాలయంలో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ

హుజూరాబాద్, జనవరి 20: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు నిబంధనలు పాటిం చాలని హుజూరాబాద్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఠాకూర్ ఈశ్వర్‌సింగ్ అన్నారు. హుజూరాబాద్‌లోని కేసీ క్యాంపులోని ఎంవీఐ కార్యాలయంలో శనివారం జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించినప్పుడే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దన్నారు. డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడవద్దని చెప్పారు. డ్రైవర్లు ఏకగ్రతతో వాహనాలు నడిపినప్పుడు క్షేమంగా ఇంటికి చేరుకుంటారన్నారు. అనంతరం రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్వర్‌పాషా, నాగరాజు, శ్రీకాంత్‌గౌడ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి 20: కరీంనగర్‌లోని సవరన్‌స్ట్రీట్‌లో మెట్టుకొమురయ్య ఇంటిలో చొరబడి దొంగతనం చేసిన ఇద్దరు నిందితులు పిట్టల అరవింద్, కట్ట హన్సర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని రెండో టౌన్ పోలీసులు తెలిపారు. ఈ నెల 17న కొమురయ్య ఇంటిలో చొరబడి 30 వేల నగదుతోపాటు 2 సెల్‌ఫోన్‌లను దొంగతనం చేయగా శుక్రవారం ఇద్దరు నిందితులను ఇందిరాచౌక్ ప్రాంతంలో పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 5 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

పొన్నం రవిచంద్రకు డాక్టరేట్

కరీంనగర్ కల్చరల్, జనవరి 20: కరీంనగర్‌కు చెందిన సినీ జర్నలిస్టు, నంది అవార్డు గ్రహీత, రచయిత, కవిసో అధ్యక్షుడు పొన్నం రవిచంద్రకు గౌరవ డాక్టరేట్ దక్కింది. శనివారం హైదరాబాద్‌లోని మ్యారీగోల్డ్ హోటల్‌లో జరిగిన యునైటెడ్ థియోలాజికల్ రీసర్చ్ యూనివర్సిటీ తరపున డాక్టరేట్ ఇవ్వగా అతిథులుగా నటి జయసుధ, నటులు మురళీమోహన్, నరేష్, శివబాలాజి, నటి పవిత్రలోకేశ్, అహోబిల రామానుజ జీయరుస్వామి, ఎంఎన్ రవికుమార్, సీహెచ్ వేంకటఫణి, యూనివర్సిటీ బాధ్యులు పాల్గొన్నారు.

సమ్మక్క జాతర ఏర్పాట్ల పరిశీలన

కరీంనగర్‌రూరల్, జనవరి 20: నగరంలోని రేకుర్తి 18వ డివిజన్‌లో నిర్వహించే సమ్మక్క జాతర ఏర్పాట్లను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో బాలబద్రి శంకర్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, మడుపు మోహన్, పులి అంజనేయులుగౌడ్, శ్రవణ్‌నాయక్, అస్తపురం దీక్షిత్, కడమండ్ల మనోజ్ కోతాడి సాయి హస్తపురం కొమురయ్య మడ్డపల్లి శ్రీనివాస్, లింగంపల్లి లక్ష్మయ్య అక్కపెల్లి మల్లేశం, పర్వత మల్లేశం, వెన్నం రజితరెడ్డి, అశోక్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

కరీంనగర్ రూరల్, జనవరి 20: నగరంలోని రేకుర్తి 18వ డివిజన్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. శనివారం ప్రచార రథం ద్వారా ఎల్‌ఈడి స్క్రీన్‌తో వీడియోను నగరవాసులు తిలకించారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ

కరీంనగర్ టౌన్, జనవరి 20: ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (పిఆర్‌టియు) రాష్ట్రశాఖ రూపొందించిన 2024 నూతన సంవత్సర డైరీని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆమె కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు 100శాతం పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్కు తిరుపతిరెడ్డి, మర్రి జైపాల్‌రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్‌రావు, జిల్లా బాధ్యులు ఉప్పు జలపతి, మండల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

●కరీంనగర్ టౌన్: విద్యార్థులను వేధిస్తున్న ప్రైవేట్ కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డొగ్గలి శ్రీధర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్‌కు వినతిపత్రం సమర్పించారు.

●కరీంనగర్ టౌన్: జిల్లా పెరిక కుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సరపు క్యాలెండర్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బస్వ వెంకన్న పాల్గొన్నారు.

●కరీంనగర్ స్పోర్ట్స్: ఝార్ఖండ్ రాష్ట్రంలో ఈనెల చివరి వారంలో జరగనున్న పాఠశాలల క్రీడాసమాఖ్య 67వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు గన్నేరువరం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి బుర్ర విష్ణువర్దన్ ఎంపికయ్యాడు. విష్ణువర్దన్‌కు జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ ట్రాక్ సూట్‌ను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

● సైదాపూర్: సైదాపూర్, ఆకునూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం విద్యుత్ లైన్ల మరమ్మతులు దృష్ట్యా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బొమ్మ అంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

● ఇల్లందకుంట: మండలంలోని బోగంపాడు, పాతర్లపల్లి గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు.

● హుజూరాబాద్ రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శని వారం ఎంపీడీవో జయశ్రీకి ఆయా గ్రామాల సర్పంచులు వినతి పత్రం సమర్పిం చారు.

● శంకరపట్నం: సర్పంచ్‌ల పదవి కాలం పొడిగించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని శంకరపట్నం మండల సర్పంచ్‌లు శనివారం ఎంపీడీవో శ్రీవాణికి వినతి పత్రం అందజేశారు.

● జమ్మికుంట రూరల్: మండలంలోని పాపయ్యపల్లి గ్రామ సర్పంచ్ వజ్జపల్లి ఆగయ్య తమ వార్డు సభ్యులను సన్మానించి జాపికలు అందజేశారు.

● జమ్మికుంట: జమ్మికుంట పట్టణానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ పొనగంటి శంకరయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ మార్కెట్ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి శనివారం పరామర్శించారు.

- పట్టణంలోని ఇందిరానగర్‌లోని మైనార్టీ పాఠశాల, కళాశాలకు సంబంధించిన 2024-25 సంవత్సరానికి గానూ అడ్మిషన్లు ప్రారంభమ య్యాయని ప్రిన్సిపాల్ ప్రణీత శని వారం ప్రకటనలో తెలిపారు.

● వీణవంక: కస్తూర్భాగాంధీ బాలికల పాఠశాలలో బాల సభ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఎలిగేటి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

● గంగాధర: గంగాధర జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు జాతీయ ఆర్ట్ పోటీల్లో పాల్గొని పతకాలను గెలుచుకున్నారని ప్రధానోపాధ్యాయురాలు అనితకుమారి తెలిపారు.

● తిమ్మాపూర్: మండలంలోని మక్తపల్లి గ్రామం నల్లగొం డ లక్ష్మీనరసింహస్వామి ఆలయం పరిధిలో పెరిక కుల(పురగిరి క్షత్రియ) సంఘం ముద్రించిన క్యాలెండర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆవిష్కరించారు.

- మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ లైన్ల మరమతుల దృష్ట్యా ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఆరవిందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

● చొప్పదండి: లెదర్‌పార్కు సాధన చర్మకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవం త్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చిత్రప టాలకు క్షీరాభిషేకం చేశారు. లెదర్ ఇండస్ట్రీ ఏర్పాటుకు కేంద్ర మంత్రులుకు వినతి పత్రం ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు

● చిగురుమామిడి: మండల కేంద్రానికి చెందిన దూల వైష్ణవికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు శనివారం 7 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. వైష్ణవి తండ్రి కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అధ్యాపకులు పరామర్శించారు.

● గన్నేరువరం: గొర్రెలు మేకల పెంపకదారుల సంఘం క్యాలెండరును శనివారం తహసీల్దారు భిక్షపతి చేతుల మీదుగా సంఘం నాయకులు ఆవిష్కరించారు.